క్లుప్తంగా

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం సురక్షితం



కూడేరు: గర్భిణులకు వైద్య సేవలందిస్తున్న వైద్యాధికారి లక్ష్మీనారాయణ

కూడేరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం సురక్షితమని మండల వైద్యాధికారి లక్ష్మీనారాయణ గర్భిణులకు తెలియజేశారు. శుక్రవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలన్నారు. రోజూ కొద్దిసేపు చిన్నపాటి వ్యాయామం, నడక తప్పనిసరి చేయాలన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్ గర్భిణులకు హిమోగ్లోబిన్, షుగర్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



మాట్లాడుతున్న వైద్యాధికారిణి తేజశ్వి

కూడేరు: ప్రభుత్వ బడుల్లో మీ పిల్లలను చేర్పించండి..నాణ్యమైన విద్యనందించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతామని ఎంఈఓ–2 సాయికృష్ణ పిల్లల తల్లిదండ్రులను తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎంఎంహళ్లి, చోళసముద్రం, కడదరకుంట, జయపురం గ్రామాల్లో పర్యటించారు. డ్రాపౌట్ పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ఉంటేనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలియజేశారు. పిల్లలను పనులకు పంపితే బాల కార్మిక చట్టం కింద చర్యలు తీసుకుంటారన్నారు. తర్వాత ఆయా గ్రామాల్లో పాఠశాలలను తనిఖీ చేసి పిల్లలకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పిల్లల హాజరు పట్టికను తనిఖీ చేశారు.

రక్తహీనత సమస్యలపై అవగాహన అవసరం

వజ్రకరూరు: రక్తహీనత సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి తేజశ్వి సూచించారు. శుక్రవారం మండలంలోని తట్రకల్లు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి అధ్యక్షతన విద్యార్థుల్లో రక్తహీనత సమస్యలు, స్టాప్ డయేరియా తదితర అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వైద్యాధికారి తేజశ్వి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాల పరిశుభ్రత తప్పక పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ సుశీలమ్మ, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు రుద్రమ్మ, వీరభద్రమ్మ పాల్గొన్నారు.

ముద్దచర్మ వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి

శెట్టూరు: తెల్లరంగు పశువుల్లో వస్తున్న ముద్దచర్మవ్యాధి నివారణకు పాడి రైతులు టీకా తప్పనిసరిగా వేయించాలని ఏడీ డాక్టర్ నాగలింగేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మంపల్లిలో ముద్దచర్మ వ్యాధిపై అవగాహన, టీకా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో తెల్లరంగు ఆవులకు, దూడలకు, ఎద్దులకు స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ ఆధ్వర్యంలో టీకా వేయించారు. వ్యాధి లక్షణాలు పశువుల్లో కనిపిస్తే పశువైద్యశాలలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అనిమల్ హస్బెండరీలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి దేవికి విశేష పూజలు



కన్యకాపరమేశ్వరిదేవిని గోరెంటాకుతో అలంకరించిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరిదేవికి ఆషాఢ మాస విశేష పూజలు నిర్వహించారు.శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం, ప్రదోష కాలంలో అమ్మవారికి గోరెంటాకులతో విశేష అలంకరణ చేశారు. అర్చకులు మంజునాథ శర్మ ఆధ్వర్యంలో లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, ప్రాకారోత్సవం, మహా మంగళహారతి ఇచ్చారు.

కళ్యాణదుర్గం: పట్టణంలోని స్థానిక వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాసం పూజలలో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. ప్రతి ఏడాది ఆషాఢంలో అమ్మవారికి ఇలా అలంకరించడం ఆనవాయితీ. ఉదయం నుంచి అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పైరుకు బలం..రైతుకు లాభం

- పచ్చిరొట్ట సాగుకు అనువైన సమయం
- జీలుగ పంటతో అనేక ప్రయోజనాలు
- నీటి నిల్వ సామర్థ్యం కూడా పెంచుతుంది..



గుమ్మఘట్ట సమీపంలో రైతు సాగుచేసిన జీలుగ పంట

గుమ్మఘట్ట: రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తుండడంతో భూమిలో భూసారం కోల్పోతున్నాయి. సేంద్రీయ ఎరువులు దొరకడం గగనంగా మారడంతో ఎక్కువ మంది రైతులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. పచ్చిరొట్ట పంటల సాగుపై దృష్టి సారిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. భూసారం పెంచే సాంప్రదాయ ఎరువులైన జీలుగ, పచ్చిరొట్ట, పిల్లిపెసర సాగుకు సరైన సమయమని వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఈ సమయంలోనే జీలుగ విత్తనాలు సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతోపాటుగా, పంటలు ఎక్కువ దిగుబడులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. జీలుగ, పచ్చిరొట్ట, పిల్లిపెసర వంటి వాటిని వరినారు వేసే నాటి వరకూ భూమిలో వేసుకోవడం వల్ల అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలోని రాయదుర్గం, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హిరేహాళ్ మండలాల వ్యాప్తంగా 1,256 హెక్టార్లలో జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చిరొట్టె పంటలు సాగు చేశారు. ఎకరాకు 15 కిలోల విత్తనం సరిపోతుంది. జీలుగ కిలో రూ.44, పిల్లిపెసర కిలో రూ.67 (సబ్సిడీ పోనూ)తో దొరుకుతుంది. పచ్చిరొట్ట పంటలను సాగు చేయడం ద్వారా భూమిలో భూసారం పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. రసాయనిక ఎరువుల ఖర్చు చాలా తగ్గుతాయి. పంట సాగు చేసిన తరువాత 45–50 రోజుల్లో పూతకు వస్తుంది. రైతన్నకు లాభం తెచ్చే పచ్చిరొట్టె పంటలను సాగు చేసుకుంటే భూమిలో భూసారం పెరిగి సారవంతంగా తయారవుతాయి. తద్వారా అధిక దిగుబడులు వస్తాయి.

భూసారం పెరుగుతుంది



గ్రామంలో సేంద్రీయ ఎరువులకోసం అనేక మంది వద్దకు వెళ్లాం. సేంద్రీయ ఎరువులను కొనుగోలు చేసి పంటలను సాగుచేయాలని అనుకున్నాం. ఎరువులు లభ్యం కాకపోవడంతో 1.50 ఎకరా పొలంలో జీలుగ పంటను సాగు చేశా. 50 రోజుల్లో పూతకు వచ్చిన తరువాత దుక్కిదున్ని వరి పంటను సాగుచేస్తాం. వ్యవసాయ అధికారులు ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు పంటను సాగుచేశాం.

– ఈశ్వర్‌రెడ్డి, రైతు, గుమ్మఘట్ట గ్రామం

పెట్టుబడి తగ్గుతుంది..



జీలుగ, జనుము, పిల్లిపెసర పంటలను సాగు చేసి భూమిలో దుక్కి దున్నితే పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. రసాయనిక ఎరువులు అధికంగా వాడాల్సిన అవసరం లేదు. యూరియా ఖర్చు తగ్గుతుంది. భూమిలో భూసారం పెరగడంతో సారవంతంగా తయారవుతుంది. పంట పూత దశకు వచ్చిన తరువాత నేలలోకి రోటోవేటర్ సహాయంతో దుక్కి చేసుకోవాలి. సూపర్ వేస్తే పంట కుళ్లి ఎరువుగా తయారవుతుంది. దున్నిన 15 రోజుల తరువాత పంట సాగు చేసుకుంటే మంచిది.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

అనారోగ్యంతో ఎర్రగుడి మాజీ సర్పంచ్ మృతి

- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఎర్రగుడి మాజీ సర్పంచ్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి (ఇన్‌సెట్‌లో) చిప్పగిరి నాగిరెడ్డి(ఫైల్)

బెళుగుప్ప: గ్రామాభివృద్ధే లక్ష్యంగా 25 ఏళ్లపాటు ఏకగ్రీవంగా ఎర్రగుడి గ్రామ సర్పంచుగా సేవలు అందించిన చిప్పగిరి నాగిరెడ్డి (86) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం ఎర్రగుడి గ్రామానికి వెళ్లి నాగిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ మాజీ సర్పంచు మృతి తమ పార్టీకి, గ్రామానికి దీరని లోటని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మాజీ సర్పంచ్ భార్య లక్ష్మీదేవి, కుమారులు బ్రహ్మానందరెడ్డి, భాస్కర్‌రెడ్డిని విశ్వేశ్వరరెడ్డి పరామర్శించారు. గ్రామ అభ్యున్నతికి కృషి చేస్తూ 25 ఏళ్లపాటు సర్పంచుగా సేవలు అందించి, గ్రామంలోని ఎస్సీ కాలనీకి, బీసీ కాలనీ, ఇందిరమ్మకాలనీలకు, జగనన్న కాలనీలకు, ప్రభుత్వ పాఠశాల నిర్మాణాలకు 12 ఎకరాల భూమిని దానం చేశారన్నారు. నాడు కాంగ్రెస్ పార్టీలో మండల కన్వీనర్‌గాను సేవలను అందించారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. మాజీ సర్పంచ్ మృతదేహానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఏడీసీసీబీ మాజీ డైరెక్టర్ శివలింగప్ప, ప్రస్తుత గ్రామ సర్పంచ్ చిప్పగిరి ప్రకాశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మచ్చన్న, పార్టీ మండల కమిటీ నాయకులు అంగడి ఎర్రిస్వామి, నరిగన్న, కరుణాకర్, శివానంద, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని దురదకుంట గ్రామంలో ఏడీఏ శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వైద్య శిబిరంలో పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్త పశువులకు చికిత్సలు, నట్టల నివారణ మందులు, పిడుదులు, గోమారి నివారణకు ఉచితంగా వంద మందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు పద్మనాభం, దుర్గప్రసాద్, రమేష్, హరిణి, పశు వైద్య సిబ్బంది, సత్య సాయి సేవా సమితి పాల్గొన్నారు.

కళాశాలల్లో 'మధ్యాహ్న భోజనం' అమలు చేయాలి



కణేకల్లు రోడ్డుపై బైఠాయించి ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలియజేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట కణేకల్లు రోడ్డుపై బైఠాయించి, ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని కోరుతూ ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు కూడా సమర్పించినట్లు తెలిపారు. కానీ ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా అసెంబ్లీలో ఈ అంశంపై మాట్లాడకపోవడం గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులపై నిర్లక్ష్యం వహించడమేనన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ప్రేమ్, గౌతమ్, అనిల్, సందీప్, బానుప్రకాష్, విష్ణు, శివారెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అశోక్

కంబదూరు: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి అశోక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రాళ్లఅనంతపురం గ్రామంలో 104 వాహనం ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 46 మందికి వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందించారు. డాక్టర్ అశోక్ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగహన కల్పించారు. ప్రస్తుతం తేలికపాటి వర్షాలు కురుస్తుండడం వల్ల వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెళుగుప్ప: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, వైద్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌డీపీ జిల్లా కోఆర్డినేటర్ సుజాత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డీపీఓ రవిశంకర్‌తో కలిసి వ్యాక్సిన్ స్టాకు, రిజిష్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యులకు మాతృ, శిశుమరణాలు లేకుండా దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పీహెచ్‌సీ నివేదికలను అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, పీహెచ్‌ఎన్ వసంత, ఎంపీహెచ్‌ఎఈఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిందుసేద్య పథకం నిధులు మళ్లించడానికేనా?

- వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్తరమణ



సమావేశంలో మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణ

ఉరవకొండ: నియోజకవర్గానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.842 కోట్ల అంచనాలతో బిందు సేద్యం ప్రాజెక్టును తీసుకొచ్చి, టెండర్లు పలిచారని, ఈ ప్రాజెక్టును తిరిగి టీడీపీ అధికారంలోకొచ్చిన తర్వాత ప్రారంభించాలని ఎల్లోమీడియా విస్తృతంగా ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెస్త రమణ అన్నారు. బిందు సేద్యం పథకం నీరు మళ్లించడానికా? నిధులు మళ్లించడానికా? అని అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బెస్తరమణ మాట్లాడుతూ టీడీపీ హయాంలో బిందు సేద్య పథకం పనులు చేయడానికి మోటాఫీమ్ సంస్థ చేపట్టిందని, ఈసంస్థ ద్వారా టీడీపీ నేతలు పెద్ద ఎత్తున కమీషన్లు దండుకున్నారన్నారు. బిందు సేద్యం ప్రాజెక్టు ద్వారా 50 వేల ఎకరాకు సాగునీరు అందించడానికి 1.67 టీఎంసీల నీరు అవసరం అవుతుందన్నారు. ఈనీటిని ఎంపీఆర్, పీఏబీఆర్, జీడిపల్లి రిజర్వాయర్ల నుంచి అనధికారికంగా తీసుకోవాలని నిర్ణయించారన్నారు. తుంగభద్ర నుంచి హెచ్చెల్సీకు మనవాటా కింద 32.5 టీఎంసీలు రావాల్సి ఉండగా, కేవలం 20 నుంచి 22 టీఎంసీలు వస్తోందన్నారు. హంద్రీనీవా నీటిని వాడుకోవాలంటే మూడు జిల్లాలను ఒప్పించాల్సి ఉంటుందని, ఇలా కేవలం రూ.కోట్ల నిధులు దారి మళ్లించడానికే మంత్రి పయ్యావుల కేశవ్ ఈపథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఇది కాకుండా కరువు పీడిత జిల్లాకు వరప్రసాదిని అన్నారు. హంద్రీనీవా కింద కేవలం రూ.10 కోట్లు వెచ్చిస్తే గుంతకల్లు, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో మొదటి దశ కింద లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వవొచ్చని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మహిళా విభాగం నాయకురాలు చంద్రమ్మ, లలితమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయదుర్గంటౌన్: 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం శనివారం రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బాలు ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

కుందుర్పి: గ్రామాల్లోని కౌలు రైతులు కౌలు కార్డు కోసం ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని ఏఓ మహేష్ తెలియజేశారు. శుక్రవారం మండలంలోని కరిగానిపల్లి, తూముకుంట గ్రామాల్లో కౌలు రైతుల కార్డుల మంజూరు – విధివిధానాలపై అవగాహన కల్పించారు.

ఇసుక ట్రాక్టర్లకు టార్పాలిన్లు

గుమ్మఘట్ట: ఇసుక ట్రాక్టర్లకు యజమానులు టార్పాలిన్లు ఏర్పాటు చేసుకుని జుంజురాంపల్లి రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఈనెల 22న 'గ్రామాల్లో ఇసుక ట్రాక్టర్లతో అవస్థలు' శీర్షికన 'సాక్షి'లో వార్త ప్రచురితమైంది. స్పందించిన పోలీసులు.. టార్పాలిన్ లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లను హెచ్చరించారు.

మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఆర్ట్స్ గ్రూప్ సీఈసీ–8, హెచ్ఈసీ–10 మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

అతిథి లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్/అప్లికేషన్స్, కామర్స్, మేథమెటిక్స్ సబ్జెక్టులకు అతిథి లెక్చరర్లు అవసరమన్నారు. ఏపీసెట్, యూజీసీ నెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్

సంక్షిప్త సమాచారం

సర్టిఫికెట్లతో కళాశాలలో ఈనెల 31న జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కూడేరు: మండలంలోని అరవకూరు అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 14 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ శివరాముడు వెల్లడించారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం వేకువజామున అరవకూరు అటవీ ప్రాంతంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పోలీసులను గమనించిన జూదరులు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వెంటపడి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.72,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అరవకూరు, సిండికేట్ నగర్, సింగంపల్లి, కూడేరు, కరుట్లపల్లి, ఆత్మకూరుకు చెందిన వారు ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

తెనగల్లు ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు

కుందుర్పి: మండలంలోని తెనగల్లు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ రవిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సదరు ఫీల్డ్ అసిస్టెంట్ బెంగళూరుకు వలస వెళ్లిన కూలీల పేర్లమీద ఉపాధి పనులు చేసినట్లు బిల్లులు చేయడంతో ఇటీవల సామాజిక తనిఖీలో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తనిఖీ బృందం విచారణలో అక్రమాలకు పాల్పడినట్లు వెలుగుచూడడంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

సాగుకు ఆలయ భూముల వేలం

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళం గ్రామంలోని ఈశ్వర దేవాలయ భూముల సాగుకు శుక్రవారం వేలం వేశారు. స్థానిక ఈశ్వరస్వామి ఆలయంలో ఎండోమెంట్ అధికారి నరసింహారెడ్డి భూముల సాగు వేలం పాట నిర్వహించారు. మొత్తం 37.52 ఎకరాల భూమికి సాగువేలం పాటలు పోటాపోటీగా సాగాయి. 17 మంది రైతులు రూ.7,87,500కు భూములు దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలి



సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

కణేకల్లు: విద్యార్థినులు నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎంఈఓ–2 భవానీశంకర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీబాలికల హైస్కూల్‌లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమంలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా పదో తరగతికి చెందిన ఫిర్దోష్ వరి పొలాల్లో తక్కువ ఖర్చుతో కలప తీసే యంత్రాన్ని స్వయంగా తయారు చేసి, అది పని చేసే విధానంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు వివిధ రకాల ప్రాజెక్టులు, చిత్రకళను ప్రదర్శించారు. ప్రతి విద్యార్థిలో నైపుణ్యం దాగి ఉంటుందని, తాము కూడా ఏదో ఒకటి చేయాలనే పట్టుదల, కృషి ఉంటే రాణిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లికార్జున, సీఆర్‌పీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంటల బీమా అందించాలి

కుందుర్పి: 2023 సంవత్సరానికి సంబంధించిన పంటల బీమా ప్రభుత్వం వెంటనే అందించాలని ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ రాధాస్వామి, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు సంఘం నాయకులు తిప్పేస్వామి, అతావుల్లా, లక్ష్మీపతి, సుదర్శన్‌రెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు సాయం అందించే విషయంలో షెడ్యూల్ ప్రకారం ఏ నెలకానెలోనే బీమా, పంట నష్టపరిహారం, రైతు భరోసా తదితర నిధులు అందించారన్నారు. గతేడాది జూన్‌నెల మొదటి వారంలోనే రైతులకు పంటల బీమా అందించి, రైతులను ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పంటల బీమా, ఎన్నికల ముందు చంద్రబాబు రైతులకు ప్రకటించిన రూ.20 వేలు పెట్టుబడి సాయంపై మంత్రులు, ఎమ్మెల్యేలు నోరుమెదపకపోవడం సరికాదన్నారు.

గ్రామాల్లో పైపులైన్లకు మరమ్మతు



కంబదూరులో పైపులైన్ మరమ్మతు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర

కంబదూరు: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో తాగునీరు లీకేజీ ఉన్న పైపులైన్లకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. స్థానిక సర్పంచ్ పద్మావతమ్మ ఆదేశాల మేరకు జగనన్న కాలనీలో బ్లాక్ అయిన తాగునీటి పైపులైన్‌ను తొలగించి కొత్త పైపులైన్‌ను ఏర్పాటు చేయించినట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. పారిశుద్ధ్యం పనులను కూడా చేపట్టారు. వర్షాలు కురుస్తుండడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర సూచించారు.

పైప్‌లైన్ ధ్వంసం



టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన పైప్‌లైన్

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని వర్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత లోకేష్‌రెడ్డి పొలంలోని పైప్‌లైన్‌ను గురువారం టీడీపీ నాయకులు ధ్వంసం చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొత్తం 24 పైప్‌లను ఎత్తుకెళ్లారు. దీంతో దాదాపు రూ.50 వేల మేర నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్: ఉద్యాన శాఖ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆశాఖ అధికారి కృష్ణతేజ తెలిపారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని ఆర్‌బీకే సెంటర్‌లో ఉద్యానశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హెచ్‌ఓ కృష్ణతేజ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ఉన్న సిబ్బంది రైతులకు ఎంఐడీహెచ్, ఆర్‌ఐకేవీవై స్కీమ్‌లపై రైతులకు వివరించాలని సూచించారు. కార్యాక్రమంలో కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం మండలాల వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఏఎస్‌ఏ, ఏపీఎంపీఓలు పాల్గొన్నారు.

ఘనంగా చిన్న పీర్ల పండుగ



కణేకల్లులోని ఉరవకొండ రోడ్డులో చిన్నపీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లులో చిన్న మొహర్రం వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఐదు రోజుల క్రితం కొలువుదీరిన పీర్లను ఉరవకొండ రోడ్డులో ఊరేగించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6: 30 గంటల వరకు చిన్న పీర్లను ఊరేగించి, అనంతరం జలధికి తీసుకెళ్లారు. భక్తులు చిన్నపీర్లకు ప్రత్యేక ఫాతేహాలు చేయించి, మొక్కులు తీర్చుకున్నారు.

కూడేరులో చిన్న పీర్ల పండుగ

కూడేరు: మండల కేంద్రంలో చిన్నపీర్ల పండుగ ప్రారంభమైంది. వేడుకల్లో భాగంగా శుక్రవారం దస్తగిరి, కుళ్లాయి స్వామి, అంగార్‌వలి, చిన్న కుళ్లాయిస్వామి, మస్తాన్‌వలి పీర్లకు ముజువార్ మైనుద్దీన్ ప్రత్యేక అలంకరణ చేసి, పీర్ల చావిడిలో కూర్చోబెట్టి చక్కెర చదివింపులు చేయించారు. మంగవారం పానకాలు, బుధవారం జలధి కార్యక్రమం ఉంటుందని ముజావర్ తెలిపారు.

ముగిసిన చిన్న పీర్ల పండుగ

రాయదుర్గంటౌన్: పట్టణంలో మత సామరస్యానికి ప్రతీక అయిన చిన్నపీర్ల పండుగ (కొడీపీర్లు) వైభవంగా ముగిశాయి. చివరి రోజు శుక్రవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని చావిడిల్లో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక ఫాతేహా పాటించి, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను పూలమాలలు, వస్త్రాలతో అలంకరించి ఊరువాకిలి వద్ద ఊరేగించారు. పీర్ల ఊరేగింపుకు కులమతాలకు అతీతంగా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కోట వీధులు జనంతో కిక్కిరిశాయి. ముజావర్లు పీర్లను ఊరేగించారు. గ్యాస్ గోడౌన్ ఏరియా, చర్చి ఏరియా, ఎన్టీఆర్‌కాలనీ, మొలకాల్మూరు రోడ్డు, బళ్లారి రోడ్డు, నేసేపేట, పాటిల్ నగర్, గుగ్గిరొట్టె ఏరియా, కూరగాయల మార్కెట్, జీఆర్‌ఎస్ కాలనీ, మధుటాకీస్ ప్రాంతాల్లో కొలువుదీరిన పీర్లను ఇక్కడికి తీసుకొచ్చి, ఊరువాలికి పీర్ల చావిడి వద్ద పూజలు చేయించడం ఆనవాయితీ.



వజ్రకరూరులో కొలువుదీరిన చిన్నపీర్లు

వజ్రకరూరులో కొలువుదీరిన చిన్నపీర్లు

వజ్రకరూరు: స్థానిక పెద్దమౌళాలి ఆలయంలో చిన్న పీర్లు కొలువుదీరాయి. ఈసందర్భంగా పెద్దమౌళాలి, హుసేన్‌స్వామి, అలీస్వామి తదితర పీర్లు కొలువుదీరాయి. శుక్రవారం ఆలయంలో పీర్లకు ప్రత్యేక పూజలతోపాటు విశేష పూజలు నిర్వహించారు.స్థానికులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ శనివారం చక్కెర చదివింపులు, అగ్నిగుండ ప్రవేశం తదితర కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జలధి కార్యక్రమం ఉంటుందన్నారు.

బాధ్యతగా మొక్కలు పెంచాలి

బ్రహ్మసముద్రం : మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణసాధ్యమని తహసీల్దార్ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వన మహోత్సవాల్లో భాగంగా చెట్టు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విశ్రాంతి ఏఈఓ మృతి



తిమ్మప్ప (ఫైల్)

కంబదూరు:ములకనూరుకు చెందినవిశ్రాంత ఏఈఓ నేసే తిమ్మప్ప (80) అనా రోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. తిమ్మప్ప రాయదుర్గంలో వ్యవసాయశాఖలో ఏఈఓగా పని చేస్తూ రిటైర్డ్ అ య్యా డు. అయితే కొద్ది రోజులు గా ఆయన అనారోగ్యంతో అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. తిమ్మప్ప మృతి పట్ల ఎంపీపీ తిమ్మరాజమ్మ, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందప్ప సంతాపం తెలియజేశారు.